# పుట్టలోని చెదలు

(జ్యోతి మాసపత్రిక)

'తల్లి, దండ్రిమీద దయలేని పుత్రుండు
పుట్టనేమి, వాడు గిట్టనేమి...."
అన్నాడు వేమన మహాకవి !
అది ఆనాటికీ ఈనాటికీ అద్భుతమయిన సత్యమే !

# పుట్టలోని చెదలు

దశరథరామయ్యగారు బాధగా మంచంమీద కదిలేరు.

పొత్తి కడుపులో ఆరంభమయిన మంట, కార్చిచ్చులా వ్యాపించి గుండెలను దహించేస్తున్నట్లు అనిపిస్తోంది.

బాధ భరించలేకుండా వుంది.

రెండు నిమిషాలసేపు మెలికలు తిరిగిపోయారు.

"ఏమండీ!" జానకమ్మ పిల్చింది.

సమాధానం చెప్పలేక గట్టిగా కళ్ళు మూసుకున్నారు.

"మళ్ళీ నొప్పి వస్తోందా?" భుజాలమీద, పొట్టమీద అనునయంగా రాస్తూ అడిగింది.

నోటితో సమాధానం చెప్పలేక అవునన్నట్లు తలవూపేరు.

నొప్పి భరించలేక కళ్ళు బిగబట్టి మూసుకుంటే, రెప్పలచాటు నుండి రెండు కన్నీటి బిందువులు ముడతలుపడిన బుగ్గలమీదినుండి పండు మీసాల మీదకు జారిపోయి ఆ గుబురులో నిలిచిపోయాయి.

భర్త పడుతున్న అవస్థకు జానికమ్మ గుండెలు అలిసిపోయాయి.

"ఇదిగో....ఈ మంచినీళ్ళు తాగండి .... నొప్పి సర్దుకుంటుంది" అంటూ కంచుగ్లాసుతో నీళ్ళందించింది.

మంచంమీద సరిగ్గా కూర్చోటానికి నడ్డి వెనుక చేయి ఆన్చి సహాయము చేసింది.

జానకమ్మ ఆసరాగా కూర్చుని, మంచినీళ్ళు రెండు గుటకలు మింగి, గ్లాసు ప్రక్కనున్న బల్లమీద వుంచేరు.

మళ్ళీ మంచంమీద వెనక్కి వాలి కళ్లు మూసుకున్నారు.

మూడు నిమిషాలలో కడుపుమంట కొస్త తగ్గినట్లు అన్పించింది.

అయితే, ఇది కేవలం తాత్కాలికమయిన ఉపశాంతి మాత్రమే !

ఏదో కడుపులో పడగానే చల్లారుతుంది.

మళ్ళీ కొద్దిసేపటికి మామూలే!

అంతలో వీధి వాకిలిగేటు తెరిచిన శబ్దమయింది.

"చూడు జానకీ! ఎవరో వచ్చినట్లున్నారు!" అన్నారు దశరధ రామయ్యగారు హీనస్వరంతో.

జానకమ్మ వీధివైపు చూసింది.

పేపరు కుర్రాడు పేపరు లోనికి గిరవాటేసి సైకిలు యెక్కి వెళ్ళిపోయాడు.

పేజీలు సర్ది పేపరు లోనికి తెచ్చింది జానకమ్మ.

"అయితే పోస్టుమేన్ కొదన్నమాట!...." ఆమె చేతిలోని పేపరు వంక చూస్తూ హీనస్వరంతో అన్నారాయన.

ఆ గొంతులో ఎంతో నిరుత్సాహం కూడా ధ్వనించింది.

"పోస్టుమేన్ ఇంకా రాలేదు" అందామె.

పోస్టుమేన్ ఆ వీధిలో ఉత్తరాలు డెలివరీచేసి వెళ్ళిపోయి అప్పుడే అరగంటయింది!

కానీ, ఆ విషయం భర్తకు చెప్పటం ఆమెకు ఇష్టంలేదు.

మరో గంట సేపటివరకూ ఆ నిరీక్షణలో అతడిని వుంచటమే ఆమెకు ఇష్టం!

పేపరు అందిస్తూ "మందు వేసుకుంటారా?" అంది.

"మరి కొంచెంసేపు పోనియ్...." అని రెండు క్షణాలు ఆగి–

"అసలు నువ్వు రాసిన ఉత్తరం వాడికి అంది వుంటుందా?" అంటూ అడిగేరు.

"ఎందుకందదండీ? ఒకటి కాదు .... రెండు రాసేను"

"గట్టిగా రమ్మని రాసేవా?"

"ఆహా! మరీ మరీ రాసేను."

"మరి, సమాధానం ఎందుకు రాయలేదంటావ్?"

"అదే అర్థంకావటం లేదండీ! మీ ఆపరేషను ఇరవయ్యో తారీఖున చేస్తానన్నారు కదా!"

"అవును సోమవారం....ఏకాదశి అని ఆవేళ చేయమన్నాను."

"అందుకే మూడు నాలుగు దినాలు ముందుగానే ఇక్కడకు చేరేటట్లు బయలుదేరి రమ్మని రాసేను. ఈవేళ పన్నెండో తారీఖుకదా! ఇంకా టయముంది. ఉత్తరం రాయటమెందుకని, ఏకంగా బయలుదేరి వచ్చేద్దామనుకున్నాడేమో!" అంది జానకమ్మ.

"నాకు నమ్మకంలేదు!" గద్గద స్వరంతో అన్నారు దశరథరామయ్యగారు.

"తప్పకుండా వస్తాడండీ! అయినా వాడి ఉద్యోగంలో వాడికెన్ని సాధక బాధకాలున్నాయో! సెలవు దొరకటం కష్టమయిపోయిందేమో ? ఇవన్నీ ఆలోచించొద్దు?"

విరక్తిగా నవ్వేరాయన.

కొంత సేపు ఆగి మెల్లగా అన్నారు.

"జానకీ! వాడికి ఎనిమిదో ఏట కలరా వచ్చింది, నీకు గుర్తుందా?"

జానకమ్మ అవునన్నట్లు తల వూపింది.

"వాడికి వాంతులూ, విరేచనాలు అయిదురోజుల వరకూ తగ్గలేదు. మనిద్దరం ఆ వెధవని....అదిగో .... అక్కడే ఆ వీధి వరండాలో పెట్టుకుని, కళ్ళలో వత్తులు వేసుకుని, రాత్రి పగలూ కంటికి రెప్పలా కాపలా కాసేం! అప్పటికి నా ఉద్యోగం పర్మనెంటు కాలేదు. పర్మినెంటు కాకుండా అన్ని సెలవలు వాడేసనే కదూ....నా ప్రొబేషనరీ పీరియడు మరో సంవత్సరం పొడిగించేరు!"

మాట్లాడటం ఆపేరాయన.

జానకమ్మ మౌనంగా భర్తవంక చూస్తూ వుండిపోయింది !

"వాడు ఎస్సెల్సీ చదువుతూ ఉండగా, కడుపులో అల్సరు పెరిగితే వాడి ఆపరేషను కోసం మద్రాసు నాలుగుసార్లు తీసుకువెళ్ళేం గుర్తుందా ?

అప్పుడు రెండు నెలలు శెలవు పెట్టాల్సి వచ్చింది నేను.... అందుకే నాకు రావాల్సిన ప్రమోషను వెనకబడిపోయిందని నీకూ తెలుసును. ఇలా ఎన్నని ఏకరవు పెట్టను ?

నీకు మాత్రం తెలీదా?

నువ్వూ నేనూ ఎన్ని బాధలుపడి వాడిని పెంచకపోతే వాడు ఈ వేళ ఇలా తిరగ్గలుగుతున్నాడు ?

ఒక్కగానొక్క నలుసని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చేం. అందుకు ఇదీ ఫలితం!

వాడికి రెక్కలొచ్చేయి!

కళ్ళువిడినాయి!

ఎగిరిపోయాడు !

రాధమ్మ వలలో పడ్డాడు! దాన్ని పెళ్ళాడి మావగారింట్లోనే ఏకంగా కాపురం పెట్టేశాడు. ఈవేళ నా ఆరోగ్యం సంగతి వాడికి యెలా పడుతుంది?

వాడు రాడు !

వాడు వస్తాడని అనుకున్నా, కోడలు రానివ్వదు.

మాట్లాడటం ఆపేరు.

ఆవేశంతో ఆయన గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి.

ఊపిరి బరువుగా పీల్చుకుంటున్నారు.

భర్తకు ఎలా నర్దిచెప్పాలో –

ఏమని సర్దిచెప్పాలో –

జానకమ్మకు అర్థంకాలేదు!

రామం తప్పకుండా వస్తాడని తాను మాత్రం ఎలా చెప్పగలదు?

ఏడాది క్రితం హైదరాబాద్ వెళ్ళిపోయిన రామం. ఈవేళ్టివరకూ ఇంటి మొహం చూడలేదు.

మామగారు అక్కడే ఉద్యోగం ఇప్పించేరట!

ఇల్లరికం వుంచేసుకున్నారు.

ఎప్పుడో రెండు నెలలకో ఉత్తరం రాస్తాడు.

పండిన ఈ వయస్సులో తానూ, భర్త ఇక్కడ -

కొడుకు అక్కడ! !

"ఏదయినా ఇల్లు విడిగా తీసుకోరాదుట్రా? మేమూ అక్కడికే వచ్చేస్తాం" అంటూ బోలెడు ఉత్తరాలు రాసింది తాను.

"ఇక్కడ ఇళ్ళు దొరకటమంటే మాటలా? ప్రయత్నాలు చేస్తున్నాను, దొరకగానే రాస్తాను" అంటూ ఆరునెలలుగా మాటలతోనే గడుపుకొస్తున్నాడు.

'అడ్డాల్లో వున్ననాడు బిడ్డలుగానీ మీసాలొచ్చేక బిడ్డలా ?' అనుకుంది.

ఆలోచనల నుండి బయటపడి "పన్నెండయి పోతోంది. అన్నం వడ్డిస్తాను" అంటూ భర్త సమాధానం కోసం యెదురు చూసింది జానకమ్మ.

"ఆకలిగా లేదు!"

"ఆకలిగా లేదని తినటం మానేస్తే ఎలా?"

"ఆకలి లేకపోతే ఎలా తినమంటావ్ ?"

"మరీ నీరసం చేస్తుంది. రెండు మెతుకులు ఎంగిలి పడుదురుగాని లేవండి" అంది.

భర్తనుండి కొంత సేపు సమాధానం రాకపోయేసరికి "...పోనీ, కంచంలో కలిపి తీసుకురానా? మంచంమీధే కూర్చుని తిందురుగాని" అంది బతిమాలుతున్న స్వరంతో.

కళ్లుమూసుకుని వద్దన్నట్లుగా తల అడ్డంగా ఆడించేరు.

గది గుమ్మానికి వున్న తెరసర్ది వీధిలోనికి వచ్చింది జానకమ్మ.

గేటు ప్రక్కనే వున్న జామచెట్టుమీద వాలిన కాకి ఒకటే గోల చేస్తోంది.

శీతాకాలమే అయినా ఎండమాత్రం విపరీతంగా వుంది.

అంతలో రోడ్డుమీద రిక్షా ఆగిన చప్పుడయింది.

రిక్షాలోనుండి దిగుతున్నారు ఎవరో !

వాడే! రామమే !

సందేహం లేదు !

జానకమ్మ మనసు ఆనందంతో హరివిల్లే అయింది !

ఒక్క ఏడాదిలో కొడుకు ఎంత ఎదిగిపోయాడు ?

చలవ కళ్ళజోడు, బెల్‌పంట్లాం, చేతిలో బ్రీఫ్‌కేసు! దొరబాబులా వున్నాడు!

పోల్చుకోనంతగా మారిపోయాడు.

రిక్షా డబ్బులు ఇచ్చేసి, వీధిలో నుండే తన వంక చూస్తూ, చిరునవ్వుతో "బాగున్నావా అమ్మా!" అంటూ పలకరించేడు.

ఆనందంతో నోట మాటరాలేదు జానకమ్మకు.

గబగబా అడుగులు వేసుకుంటూ లోనికి నడిచింది -

కాదు - పరుగెత్తింది!!

"ఏమండీ" అని పిలుస్తూ భర్త మంచం దగ్గరకు వెళ్ళింది.

"ఏమయింది?"

"రామం వచ్చేడండీ!"

"ఏమిటి? నిజమే! నిజంగా రామం వచ్చేడా ?"

"నిజమేనండీ! వాడు రాడని బెంగ పెట్టుకున్నారు మీరు. నామాట విన్నారు కాదు! వాడు తప్పకవస్తాడని మొదటినుండీ చెప్తూనే వున్నాను నేను. వాడు నా కొడుకండీ! ఆపరేషను వుందని రాస్తే, రాకుండా యెలా వుంటాడు ?" అంటూ ఆనందోద్వేగాలతో గబగబా మాట్లాడింది జానకమ్మ.

దశరథరామయ్యగారి కనులు చెమర్చేయి.

ఆయనకు ఒక్కసారి వేయి ఏనుగుల బలం వచ్చినట్లయింది.

ఆనందంతో ఆయన మనసు సముద్రమల్లే ఉప్పొంగింది.

అంతలోనే రామం లోపలకు వచ్చేడు.

బ్రీఫ్ కేసు మంచం ప్రక్కనే పెట్టాడు.

తండ్రి ప్రక్కలో మంచంమీద కూర్చున్నాడు.

"ఎలా వున్నారు నాన్నా? అయ్యో! యిదేమిటి? ఇంతలా చిక్కిపోయారేమిటి? అవసరేమను వరకూ వచ్చేదాకా ఎందుకు ఊరుకున్నారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించేడు.

దశరథరామయ్యగారికి ఆనందంతో ఏడుపు వచ్చింది.

"నాకేంరా! బాగానే వున్నాను!" అంటూంటే గొంతు గద్గదమయిపోయింది.

ఆయన ముఖంలోని దుఃఖాన్ని గమనించిన రామం "అదేమిటి నాన్నా! అలా బేలగా అయిపోరారేం?" అంటూ అనునయించే యత్నం చేశాడు.

"అబ్బే! అదేం కాదురా! అది సరే, నిన్న సాయంకాలం ఎప్పుడో ఎక్కివుంటావు రైలు, ఎండనపడి వచ్చేవు! స్నానంచేసి నాలుగు మెతుకులు తినిరా...." అంటూ భార్య వంక తిరిగి "జానకీ! స్నానానికి నీళ్ళు పెట్టు!"

అని ఆజ్ఞ జారీచేసి తిరిగి రామంతో "రాధమ్మ ఎలా వుందిరా? అసలే ఒట్టి మనిషికాదు. జాగ్రత్తగా చూసుకుంటున్నావా?" అంటూ ఏవేవో ప్రశ్నలు అడిగేరు.

కొన్నిటికి తానే సమాధానాలు కూడా చెప్పుకున్నారు.

కొడుకు ఒళ్ళు తడిమి "ఇలా చిక్కి పోయావేమిట్రా? నీకా హైదరాబాద్ నీళ్లు పడలేదు" అంటూ వాపోయారు.

"మీరు విశ్రాంతి తీసుకోండి నాన్న! నేను వెళ్ళి స్నానముచేసి వస్తాను" అంటూ లేచాడు రామం.

రామం లోపలకు వెళ్ళగానే దశరథరామయ్యగారు లేచి కూర్చున్నారు.

ఇప్పుడు ఆయనకు పేపరు చదవటానికి ఉత్సాహంగా వుంది.

లేచి గంతులు వేయాలని కూడా వుంది.

రామం వచ్చినందుకు మనసు ఆనందముతో ఉప్పొంగిపోతోంది.

అంతవరకూ ఆవహించి వున్న బెంగ, భయం దూరంగా పారిపోయినట్లనిపించింది ఆయనకు.

ఆయన మనసు వేయి ఆపరేషన్లు చేయించుకునేందుకు రెడీ అయిపోయింది.

సగం ఆరోగ్యం అప్పుడే అందినట్లయింది.

సగం రోగం తగ్గిపోయినట్లయింది.

ఉత్సాహంగా పేపరు చదవటంలో లీనమయిపోయారు.

రామం స్నానం ముగించి భోజనానికి సిద్ధమయ్యేను.

జానకమ్మ వచ్చి "మీరూ లేవండి! నాలుగు మెతుకులు తిందురుగాని" అంది.

"నాకు ఆకలి లేదన్నాను కదా! వాడికి వడ్డించు"

జానకమ్మ వంటింటిలో పీటవేసి రామానికి అన్నం వడ్డిస్తోంది.

కొసరి కొసరి రామంచేత తినిపిస్తోంది.

దశరథరామయ్యగారు పేపరు చదవటం ముగించి టేబిలుమీద వదేశారు.

వంటింట్లో మాట్లాడుకుంటున్న తల్లీకొడుకుల సంభాషణ ఆయన చెవిని పడుతోంది.

"అయితే నీకా రెండు ఉత్తరాలూ అందేయా లేదా?" జానకమ్మ అడుగుతోంది.

"అందాయమ్మా! తీరిక దొరక్క జవాబు రాయలేను. నేను ప్రమోషన్ పేనల్‌లో వున్నానమ్మా! యిప్పుడు శెలవు పెట్టటం సాధ్యపడదు. ఈ ఒక్కరోజుకే మా ఆఫీసరు మూలుగుతూ శెలవిచ్చేడు...."

కొంతసేపు నిశ్శబ్దం!

తర్వాత మళ్ళీ రామం అంటున్నాడు.

"....మా జోనల్ మేనేజరు ఈ వూరి తాసిల్దారుగారి అల్లుడే! నాన్నా, తాసిల్దారుగారూ ప్రాణస్నేహితులు కదా! అందుకని నాన్నచేత తాసిల్దారుగారికి చెప్పించి వాళ్ళ అల్లుడికి నా ప్రమోషను గురించి రికమెండేషను లెటరు తీసుకువెళ్దామని వచ్చేను. ఉత్తరం తీసుకువెళ్తే నా ప్రమోషను ఖాయం."

"వీలుచూసుకొని ఆపరేషను నాటికి ఎలాగయినా రాలేవుట్రా?" జానకమ్మ అభ్యర్థన.

"ఇరవయ్యో తారీఖు మా జోనల్ మేనేజరు కూతురు పుట్టినరోజు! పార్టీ ఏర్పాట్లన్నీ ఆయన నానెత్తిన పడేశాడు. తీరా మాటఇచ్చేక ఇప్పుడు కాదంటే బాగుండదు!"

రామం గొంతు దశరథరామయ్యగారి మనసును కోత పెడుతోంది.

దీర్ఘంగా నిట్టూర్చి, మెల్లగా మంచంమీద వెనక్కు వాలేరు!